

పథకాలకు వేళాయె..



అడ్డాకుల మండలం కందూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి(ఫైల్)

- నేడు సీఎం చేతుల మీదుగా నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభం
- సొంత నియోజకవర్గంలోని కోస్గి మండలం చంద్రవంచకు ముఖ్యమంత్రి రాక
- మొత్తం పథకాలకు ఉమ్మడి జిల్లాలో 2,89,087 మంది దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో అధికంగా ఇందిరమ్మ ఇళ్లకు 1,30,541.. రైతు భరోసాకు 6,320..
- రేషన్ కార్డులకు 125110.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 27,116..
- 33,183 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూమిగా గుర్తింపు

మహబూబ్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి నాలుగు కీలకమైన సంక్షేమ పథకాలకు ఉమ్మడి జిల్లా కేంద్రంగా శ్రీకారం చుట్టనుంది. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తన సొంత నియోజకవర్గంలోని కోస్గి మండలం చంద్రవంచ గ్రామం నుంచి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించింది. ప్రజాపాలన, సమగ్ర సర్వే సందర్భంగా వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి.. జాబితాలను సిద్ధం చేశారు. అనర్హుల ఏరివేత, జాబితాలో పేర్లు లేని వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. అయితే ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా రైతు భరోసా కోసం ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. అయితే ఇప్పుడు ఈ దరఖాస్తులను ఫైనల్ చేయడం అధికారులకు తలనొప్పిగా మారే అవకాశం కచ్చితంగా కనిపిస్తోంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మొదటి విడత కింద కేటాయించగా.. 12 నియోజకవర్గాలకు కలిపి 42 వేల ఇళ్లు ఇచ్చే అవకాశం ఉంది. ఒక్క వనపర్తి జిల్లాలోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం 59 వేల పైచిలుకు దరఖాస్తులు రావడం గమనార్హం. విస్తీర్ణం, నియోజకవర్గాల వారీగా పెద్దగా ఉన్న జిల్లాలో కూడా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇన్ని దరఖాస్తులు రాలేదు. రేషన్ కార్డుల కోసం కూడా అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. అంతమందికి కార్డులు ఇవ్వడం సాధ్యమేనా? అనే అభిప్రాయం

(మిగతా 6లో..

జిల్లాల వారీగా పథకాలకు దరఖాస్తులు ఇలా..

జిల్లా	ఇందిరమ్మ ఇళ్లు	ఆత్మీయ భరోసా	రేషన్ కార్డులు	రైతు భరోసా
మహబూబ్‌నగర్	17384	2580	33913	699
నాగర్‌కర్నూలు	8975	3038	21012	543
నారాయణపేట	33416	4212	17450	3818
గద్వాల	10995	7105	23197	917
వనపర్తి	59771	10181	29538	343

జిల్లాల వారీగా రైతు భరోసా కింద ఎంపికైన భూముల వివరాలు(ఎకరాల్లో)

జిల్లా	గ్రామాలు	మొత్తం భూమి	సాగుకు యోగ్యం కాని భూమి
మహబూబ్‌నగర్	306	460883	11800
గద్వాల	255	464915	5540
నాగర్‌కర్నూల్	348	739331	7753
వనపర్తి	255	364454	4345
నారాయణపేట	280	442063	3744



నేడు చంద్రవంచకు సీఎం రాక

- ప్రభుత్వ పథకాలు ప్రారంభం 6
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్

భక్తిశ్రద్ధలతో అభయుడి శకటోత్సవం



ధ్వజారోహణంలో పాల్గొని పూజలు చేస్తున్న సత్యనారాయణరెడ్డి, భక్తులు

ఊర్కొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శకటోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం, ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకొని ఉత్సవాలు (జాతర) నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు వివిధ జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. శనివారం ఉదయం ఊర్కొండపేట చిలివెల్లి కృష్ణమూర్తి ఇంటి నుంచి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగింపుగా ఆలయ ప్రవేశం చేయించారు. బ్రహ్మోత్సవాల ధర్మకర్తల మండలి ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, సభ్యులు, స్థానిక నాయకులు ధ్వజారోహణంతో స్వామికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణ, అభరణాల అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శకటోత్సవం ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, కార్లను ఆలయం చుట్టు ప్రదక్షిణం చేశారు. ఆలయ పరిసరాలు అంజనేయ నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్వకుర్తి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రవీణ్ శర్మ, శ్రీనివాసశర్మ ఆలయం సిబ్బంది మారుతిరావు, వరలక్ష్మీ, శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.



ఊర్కొండపేట అభయాంజనేయస్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎద్దుల బండ్లు



వివిధ రకాల స్టాల్స్ ప్రదర్శనకు ఏర్పాట్లు



అతిథుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



పరేడ్ గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

నాగర్‌కర్నూల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో ఆదివారం జరగనున్న గణతంత్ర దినోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్ ఆవరణలో 76వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్ ఆవరణలో ఎలాంటి ఇబ్బందులు లోటుపాట్లు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చేందుకు వెళ్లేందుకు వేర్వేరుగా దారులు ఏర్పాటు చేసి బ్యారీకేడ్లు ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం సభావేదిక అలంకరణతో పాటు ఆయా విషయాలను అధికారులతో చర్చించి సూచనలు చేశారు.



మార్కెట్‌లోకి విక్రయానికి వచ్చిన వేరుశనగ పంట

పరేషాన్‌లో పల్లి రైతులు

- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- పడిపోయిన ధరలు
- జిల్లాలో లక్షా 20 వేల 280 ఎకరాలలో వేరుశనగ సాగు
- అచ్చంపేట మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.7107

ఈ ఏడాది యాసంగిలో వేరుశనగ సాగుచేసిన రైతుల ఆశలు గల్లంతయ్యాయి. గతేడాది మాదిరిగా దిగుబడి, ధర ఉంటే కొంత లాభాలు పొందవచ్చని ఆశించారు. కానీ వాతావరణంలో మార్పుతో పంట మొదటి నుంచే తెగుళ్ల బారిన పడింది. తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు వివిధ రకాల మందులు పిచికారి చేశారు. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరిగినా దిగుబడి మాత్రం తగ్గిపోయింది. రాత్రింబవళ్లు కష్టపడితే వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే వ్యాపారులు తేమశాతం పేరుతో ధరలు తగ్గించడంతో అప్పుల పాలవుతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే వరికి మద్దతు ధర ప్రకటించినట్లుగా వేరుశనగకు కూడా మద్దతు ధర ప్రకటించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి

6

డ్రైవర్ అజాగ్రత్తతో ప్రాణం కోల్పోయిన చిన్నారి



లోహిత ఫియాన్సీ (ఫైల్)

వీపనగండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్ అతివేగం అజాగ్రత్తతో ఓ చిన్నారి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన కాటమరాజు గంగాధర్‌కు 18 నెలల కూతురు లోహిత ప్రియాన్సీ ఉన్నది. శనివారం ఉదయం ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండగా శ్రీరంగాపూర్ నుంచి కల్వరాలకు వెళ్తున్న బులోరా వాహనం ఢీ కొట్టింది. కొన ఊపిరితో ఉన్న కూతుర్ని చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న కూతురును వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉన్న ఒక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. డ్రైవర్ అతివేగం వలనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ రాణి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

నాగర్‌కర్నూల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఓటు హక్కును నమోదు చేసుకుని ఎన్నికల సమయంలో ఓటును వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీ మైదానంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో అందరి చేత ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి మన ఓటు-మన హక్కు అనే నినాదాతో పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఓటు అనేది దేశ భవిష్యత్తు రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని, 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తమ పేరును ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, జిల్లాలోని ప్రధాన అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ ఓటరు అవగాహనలో పాల్గొన్నారు. అనంతరం వారందరితో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ ఓబులేష్, ఎస్‌డీసీ అరుణరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ మునిసిపల్ కార్యాలయం

కష్టపడ్డాం అభివృద్ధి చేశాం

- నేటితో ముగియనున్న పుర పాలకుల పదవీ కాలం
- 'ఆంధ్రజ్యోతి'తో ఉమ్మడి పాలమూరు జిల్లాల మునిసిపల్ చైర్మన్ల మనోగతం

7



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

నేటి నుంచే పథకాలు అమలు

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత(రేషన్ కార్డులు) ఇందిరమ్మ ఆత్మీ భరోసా పథకాలను ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు సంక్షేమ పథకాలు అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతీ మండలంలో ప్రజా ప్రతినిధులను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోను పథకాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి గాను ప్రత్యేకంగా ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు ఉన్నారు.

భర్త ఆచూకీ కోసం భార్య ఫిర్యాదు

- శుక్రవారం నుంచి కనిపించడం లేదని వెల్లడి

7

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు
- ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీలు

7

పనిచేసినా ఫలితం దక్కలే..

- గౌరవ వేతనం, సీసీఎల్ అందచేయాలని కలెక్టర్‌కు వినతి
- పక్క జిల్లాలో అందాయంటున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు
- అందాల్సిన గౌరవ వేతనం రూ. 2,24,71,460



ఉప్పల క్యాంపులో నేలపై కూర్చుని వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్(ఫైల్)

6

పథకాలకు వేళాయె



నారాయణపేట జిల్లా మద్దూరులో శుక్రవారం సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు రాస్తున్న ప్రజలు

(5వ పేజీ తరువాయి)

వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు లక్షల్లో రేషన్ కార్డులు ఉన్నాయి. ఎనిమిదేళ్లుగా గత ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపేయడంతో ఇంత భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు స్పష్టమవుతోంది.

రెండింటికే అత్యధికంగా దరఖాస్తులు

గ్రామ సభల్లో అప్పటికే వచ్చిన జాబితాతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో.. ప్రధానంగా రెండు పథకాలకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు భారీ సంఖ్యలో దరఖాస్తుఉ వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అత్యధికంగా 13,0541 దరఖాస్తులు రాగా.. మొదటి విడతగా 42 వేల మందికి లబ్ధి చేకూరనుంది. రేషన్ కార్డుల కోసం 1,25,110, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం 27,116 దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకం కోసం వనపర్తి జిల్లాలోనే అత్యధిక మంది అర్జీలు పెట్టుకున్నారు. ప్రభుత్వం అనుకున్నట్లు నిధులు విడుదల చేసి.. సంవత్సరానికి 3,500 చొప్పున నియోజకవర్గాల్లో ఇళ్ల మంజూరు చేస్తే వచ్చే మూడేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు అందరికీ పక్కా గృహాలు అందుతాయనే భావన ప్రజల్లో ఉంది. ఇప్పటికే ఏడాది ఆలస్యం కాగా.. వచ్చే బడ్జెట్ నుంచి 2027 బడ్జెట్ వరకు ఈ పథకం కోసం భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దాదాపు ఉమ్మడి జిల్లా పరిధిలోనే రూ. 6,500 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల కోసం వెచ్చించాల్సి ఉంటుంది. ఇక రైతు భరోసా ఇప్పటికే లబ్ధిదారుల జాబితా ఉండగా.. కొత్తగా 6,320 మంది దరఖాస్తు చేసుకున్నారు. అన్ని జిల్లాల కంటే భిన్నంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో రేషన్ కార్డులు మినహా మిగతా మూడు పథకాలకు చాలా తక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయి.

33,183 ఎకరాల గుర్తింపు

గత ప్రభుత్వం కొండలు, గుట్టలు, వెంచర్లు, ఇతర వాణిజ్య అవసరాల కోసం వినియోగించిన భూములకు రైతుబంధు పథకం ద్వారా డబ్బులు ఇచ్చిందనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు యోగ్యమైన భూములను గుర్తించి, యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో భువన్ యాప్ సాయంతో సర్వే నిర్వహించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 33,183 ఎకరాలు సాగుకు యోగ్యం కాదని గుర్తించారు. కొత్తగా ప్రారంభించనున్న రైతు భరోసా పథకం నుంచి వాటిని తొలగించి.. సాగుకు యోగ్యమైన భూములు ఉన్న రైతులకు మాత్రమే ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో వేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సాగుకు యోగ్యం కాని భూములను అత్యధికంగా గుర్తించగా.. వనపర్తి జిల్లాలో అత్యల్పంగా గుర్తించారు. ప్రధానంగా వెంచర్లు, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములు, కొండలను పరిగణలోకి తీసుకున్నారు. అయితే సాగులో భూమి ఉన్నా లేకున్నా.. సాగుకు యోగ్యంగా ఉంటే మాత్రం వాటిని రైతుభరోసా కింద అర్హత ఉన్నట్లు గుర్తించారు.

నేడు చంద్రవంచకు ముఖ్యమంత్రి రాక

● ప్రభుత్వ పథకాలు ప్రారంభం

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని చంద్రవంచ గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నాలుగు ప్రజా పథకాలను సీఎం ప్రారంభించనున్నారని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె చంద్రవంచలో సభా స్థలం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. స్టేజీ, పథకాలు ప్రారంభించే స్థలం, సభా స్థలం పరిశీలించి సూచనలు చేశారు. సీఎం వచ్చే రోడ్డు వెంట ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం నారాయణ పేట డీఎస్పీ లింగయ్య హెలిప్యాడ్ స్థలాన్ని, రోడ్డు మార్గాన్ని పరిశీలించి సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాడా అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఖైదీలు కుటుంబాలతో సంతోషంగా గడపాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ నేరాల్లో జైలుకు వచ్చిన ఖైదీలు జైలు నుంచి విడుదలయ్యాక కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా జైలులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చట్టాలపై ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవాధికార చట్టం కింద ఉచిత న్యాయ పొందే అవకాశాలు, అండర్ ట్రయల్ ఖైదీల హక్కులు, శిక్ష పడిన ఖైదీల హక్కులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కల్యాణ్ చక్రవర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర, నాలుగో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ భావన, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్టపాగ రఘుపతి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్

మిడ్జిల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు శనివారం తెలిపారు. మండలంలోని కొత్తూర్, మిడ్జిల్ గ్రామాల మధ్యనున్న దుందుభీ వాగులోంచి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిశోధనలో పారదర్శకత పెరగాలి: ఎస్పీ



కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కేసుల పరిశోధనలో పారదర్శకత పెరగాలని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బలమైన సాక్షాలను సేకరించగలగాలని ఎస్పీ జానకి పోలీస్ అధికారులకు సూచించారు. అప్పుడే నేరస్థులకు శిక్షపడే శాతం పెరుగుతుందన్నారు. శనివారం ఎస్పీ తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు డీఎస్పీ, సీఐ, ఎస్‌హెచ్‌వోలతో అండర్ ఇన్వెస్టిగేషన్, గ్రేవ్ అండర్ ఇన్వెస్టిగేషన్, ఎస్సీ, ఎస్టీ యూఐ, పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతీ డీసీ ఫైల్‌ను అందులో ఉన్న డాక్యుమెంట్స్‌ను పరిశీలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సీసీ నెంబర్లు తీసుకోవాలని కోరారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రివెంట్ యాక్షన్ తీసుకోవాలని, పాత నేరస్థులపై నిఘా ఉంచి జైలు నుంచి రిలీజ్ అయ్యాక వారి కదలికలను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు పనితీరు ఫీడ్‌బ్యాక్ కోసం ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పెరగాలని, తద్వారా కేసుల శాతం తగ్గాలని వెల్లడించారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గంజాయి, గుట్కా, పీడీఎస్ రైస్, పేకాట, గుడుంబా, వైట్‌కాలర్ నేరాలు, ఇతర అసాంఘీక కార్యక్రమాలపై నిఘా ఉంచాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24/7 గస్తీ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేసిన ఉమెన్ ఎస్ఐ సుజాత, ఏ.అరుణ, కోర్టు లైజనింగ్ అధికారులు బి.నాగిరెడ్డి, హెచ్‌సీ నర్సింహులు, అబ్దుల్ ముజీబ్, కృష్ణయ్య యాదవ్, కానిస్టేబుల్ యాసిన్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ రాములు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ వోబీసీ రిజర్వేషన్లు కల్పించాలి: శ్రీనివాస్‌గౌడ్

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రైవేటు రంగంలోనూ వోబీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని దక్షిణ భారత వోబీసీ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు, తెలంగాణ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి, జనతాదళ్(సెక్యులర్) జేడీ కుమార స్వామి గౌడకి విజ్ఞప్తి శనివారం చేశారు. జేడీ కుమార స్వామిని బెంగళూరులోని ఆయన నివాసంలో దక్షిణాది రాష్ట్రాల వోబీసీ సంఘాల నాయకులు బాలరాజు గుత్తేదార్, శివకుమార్, ఓంకార్, గోపిగౌడ్ తదితరులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ కలిశారు. శ్రీనివాస్‌గౌడ్ మా ట్లాడుతూ దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని, పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. తెలంగాణ తరహాలో కర్ణాటకలోనూ అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. జేడీఎస్ ఇచ్చిన హామీ మేరకు నీరా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టినట్లుగా మత్స్యకారులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, విశ్వకర్మలు, చేనేత, కల్లుగీత కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.



ఇసుక అక్రమ తరలింపునకు నిరసనగా రైతుల వంటావార్పు

ఇసుక తరలించొద్దు

- దుందుభీ వాగు సమీపంలో రైతుల వంటావార్పు

తెలకపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామ సమీపంలోని దుందుభీ వాగునుంచి ఇసుకను తరలించొద్దని రైతులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. శనివారం దుందుభీ వాగు సమీపంలో రైతులు వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మురళీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ దుందుభీ వాగు సమీపంలో దాదాపు 150వరకు బోర్లు ఉన్నాయని, ఇసుక తరలిస్తే బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వాగుపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదువేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నామని అన్నారు. అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇసుక తరలింపు ఇదేవిధంగా కొనసాగితే పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని వాపోయారు. ప్రాణాలకు తెగించైనా ఇసుక తరలింపు ఆగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ రైతులు ఆంజనేయులుగౌడ్, యాకుబ్, ఆయూబ్, ఇక్బాల్, జగత్‌రెడ్డి పాల్గొన్నారు.

పరేషాన్‌లో పల్లి రైతులు

అచ్చంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పల్లీ రైతులు పరేషాన్‌లో ఉన్నారు. తెగుళ్ల అధికమవడంతో ఈ ఏడాది దిగుబడి కూడా తగ్గింది. ధరలు కూడా పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 62,134 మంది రైతులు 1,20,280 ఎకరాలలో వేరుశనగ సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పల్లి మార్కెట్ వస్తోంది. గతేడాది క్వింటాల్ ధర దాదాపు రూ.9 వేలపైనే ఉన్నది. అయినా మార్కెట్లో వ్యాపారులు, సిబ్బంది ఏకమై రైతులను నిండా ముంచుతున్నారని అప్పటి మార్కెట్ చైర్మన్‌పై వేరుశనగ రైతులు చేసిన విషయం విదితమే. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 17 నుంచి 22 వరకు 1,461 మంది రైతులు, 16,510 క్వింటాళ్ల వేరుశనగను విక్రయించారు. బుధవారం వ్యవసాయ మార్కెట్‌లో గరిష్ఠ ధర క్వింటాలుకు రూ.7,107 పలికింది. కనిష్ఠ ధర రూ.4,510 పలికింది. మోడల్ ధర రూ.6,069, వ్యాపారులు నిర్ణయించారు. అరుకాలం కష్టపడి పడించిన రైతులకు మద్దతు ధర రాకపోవడంతో చాలా మంది రైతులు నిరాశకు లోనవుతున్నారు.

తేమశాతం పేరుతో భారీ మోసం

రైతులు పడించిన వేరుశనగ పంటను వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు తేమశాతం పేరుతో భారీ మోసానికి పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగా ఉన్నా.. ధరలు కూడా భారీగా తగ్గించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేమశాతం 70 నుంచి 71 మాత్రమే వస్తుందని వ్యాపారులు అంటుంటే కొంతమంది రైతులు 70 శాతానికి పైగా వస్తున్నా వ్యాపారులు మాత్రం తక్కువ ధర వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



మార్కెట్‌లో వేరుశగనను తూకం వేస్తున్న కూలీలు

ధర తక్కువ వేశారు



నాలుగు ఎకరాలలో వేరుశనగ పంట వేశాను. పోయిన ఏడాది 130 బస్తాలు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 88బస్తాలు మాత్రమే వచ్చింది. తెగుళ్ల రావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా పెరిగిపోయాయి. గతేడాది కంటే ధర కూడా తక్కువనే అంటున్నారు. పంట నష్టం.. ధర తక్కువ అంతా రైతుకే నష్టం అయితే ఎలా బతకాలి.

- సోమ్లా, రైతు, శంకరయ్య గుట్ట

ప్రభుత్వమే మద్దతు ధర ఇవ్వాలి



ఈ ఏడాది వేరుశనగ పంటకు తెగుళ్ల సోకి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దిగుబడి అనుకున్న మేర రాకపోయినా పండిన పంటకైనా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తే రైతులకు కొంత భరోసా ఉండేది.

-రామ్‌లక్ష్మయ్య యాదవ్, రైతు బొమ్మన్‌పల్లి

తేమశాతం వచ్చినా ధర తక్కువ చెల్లిస్తున్నారు



వేరుశనగలో తేమశాతం76 వచ్చినా క్వింటాల్‌కు ధర రూ.6,240 ఇస్తా అంటున్నారు. 70 శాతం వచ్చిన అంతే ధర ఇస్తున్నారు. తేమశాతం పేరుతో రైతులను ముంచుతున్నారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర నిర్ణయించినట్లుగా పల్లి రైతులకు కూడా మద్దతు ధర కల్పించి బోనస్ ఇవ్వాలి

- రవి, పల్లి రైతు, సిద్దాపూర్

భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి పూజలు

బిజినేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జేష్టాదేవి సమేత సార్ధసప్త శనీశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి తెలిపారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన వారు ఆలయ ఆవరణలోని నందీశ్వర పరమశివుని వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఉమామహేశ్వరం, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ప్రపంచ సమస్యల పరిష్కారంలో గణితశాస్త్రం పాత్ర కీలకం

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కే రమేష్ బాబు
- విజయవంతమైన జాతీయ స్థాయి గణిత వర్క్‌షాప్



గణితశాస్త్ర పరిశోధకుడు, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కే రమేష్ బాబును సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాములు, సిబ్బంది

బిజినేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారంలో గణితశాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని గణిత శాస్త్ర పరిశోధకులు, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.రమేష్ బాబు అన్నారు. మండలంలోని పాలెంలో ప్రభుత్వ ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ డిగ్రీ కళాశాలలో శనివారం గణిత శాస్త్ర జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించి మాట్లాడారు. గణిత నమూనాల తయారీలో వినూత్న విధానాలను అన్వేషించడానికి వివిధ విభాగాల తయారీ అనువర్తనాలను వివరించారు. గణితం మానవుల్లో పరిశోధన, విశ్లేషణ అనే విత్తనాలను నాటుతుందని, గణిత పరిశోధన సమాజానికి, అధ్యయనాల పురోగతికి ఉపయోగపడుతుందన్నారు. ప్రగతిశీల దేశంగా మార్చే వివిధ పరిశోధన విజయాలకు గణితం ప్రధానమైనదని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులు గణితశాస్త్ర అనువర్తనాలపై ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, అధ్యాపకులు నాగరాజు, సుష్మ శివ, రాధాకుమారి, స్వప్న, నాగలింగం, మనోజ్ కుమార్, వెంకటేష్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి మరో బెదిరింపు లేఖ

- ఇటీవలే లేఖ రాసిన రంగారెడ్డిగూడకు చెందిన ముగ్గురి అరెస్ట్
- మొన్న లచ్చన్నదళం పేరుతో లెటర్‌ను గోడకు అతికించారు
- నేడు అదే పేరుతో పోస్టు
- పెద్దవారితో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక

జడ్చర్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డికి శనివారం మరో బెదిరింపు లేఖ వచ్చింది. ఎమ్మెల్యే స్వగ్రామమైన రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలోని ఓ ఇంటి గోడకు ఇటీవల లచ్చన్న దళం పేరుతో లెటర్‌ను అతికించగా, నేడు అదే పేరుతో పోస్టు ద్వారా పంపించారు. ఇటీవలి లేఖ రాసిన ఎమ్మెల్యే స్వగ్రామం రంగారెడ్డిగూడకు చెందిన నలుగురు వ్యక్తులలో ముగ్గురిని పోలీసుల అరెస్ట్ చేసిన విషయం విదితమే. మంచి, చెడు కనిపెట్టాలని, పెద్దవాళ్లకు ఇజ్జత్ ఇవ్వాలని, పైసలు ఉన్నాయని నీలుగకు అని, గర్వం ఉన్న వాళ్లు ఎన్నడూ మినిస్టర్ కారంటూ తాజాగా రాసిన లేఖలో పేర్కొన్నారు. అందరితో మంచిగా ఉండి మినిస్టర్ కావాలని పేర్కొన్నారు. మొన్న రంగారెడ్డిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు తుర్కోళ్లను, ఇంకొకరిని పోలీసులు పట్టుకుపోయిండ్రని మరువకు, జాగ్రత్తగా ఉండు అంటూ హెచ్చరించారు. కాగా ఈ లేఖ సైతం ఎమ్మెల్యే ఎదుగుదలను ఓర్వలేకనే కావాలనే రాసినట్లుగా ఉన్నదని, దళాలకు చెందిన వ్యక్తులు కాదంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొట్టిపారేస్తున్నారు. కాగా ఇటీవల అరెస్టు అయిన రంగారెడ్డిగూడ గ్రామానికి చెందిన వారికి సంబంధించిన వారెవరైనా ఈ లేఖలు రాసి ఉంటారన్న అనుమానాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి వ్యక్తంచేశారు. అదేవిధంగా జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాయిరెడ్డికి లచ్చన దళం నక్సలైట్ పార్టీ పేరుతో బెదిరింపు లేఖ వచ్చింది. ఆ లేఖ ఆయనకు 22వ తేదీన రాగా శనివారం విలేకరులకు సమాచారం ఇచ్చారు. తనకు వచ్చిన లేఖపై జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సాయిరెడ్డి తెలిపారు.

దక్కని గౌరవం

అయిజ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్లకు నేటి వరకు గౌరవ వేతనం అందలేదు. నెల రోజుల పాటు ఇంటింటికి తిరిగి సమాచారాన్ని రాబట్టినా వారికి నిరాశే ఎదురవుతోంది. అవమానాలు, చీత్కారాలు ఎదురయిన చేయాల్సిన పనులు సకాలంలో పూర్తి చేసి అధికారుల మన్ననలు పొందారు.

జిల్లాలో..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని 13 మండలాల్లో 255 గ్రామపంచాయతీలలో 1,685 మంది ఎన్యుమరేటర్లు, 500 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. 1,67,886 కుటుంబాలను సర్వే చేశారు. ఇందులో ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు అధికారులు పురపాలక సిబ్బంది, సూపర్‌వైజర్లు పనిచేశారు. ఒక్కో ఎన్యుమరేటర్ దాదాపు 110 నుంచి 130 కుటుంబాల వరకు సర్వే చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు గతేడాది కుటుంబ సర్వే చేపట్టింది. ఇందు కోసం నవంబరు 9వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. సర్వేలో సేకరించిన వివరాలను 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పొందుపరచారు.

అందాల్సిన గౌరవ వేతనం

జిల్లాలోని 13 మండలాల్లో 255 గ్రామపంచాయతీలలో 1,685 మంది ఎన్యుమరేటర్లు, 500 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. 1,67,886 కుటుంబాలను ఉద్యోగులు సర్వే చేశారు. 1,685 మంది ఎన్యుమరేటర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.1,68,50,000 అందాల్సి ఉంది. 500 మంది సూపర్‌వైజర్లకు ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున రూ.6 లక్షలు అందాల్సి ఉంది. ఇక డేటా ఎంట్రీ కోసం ఒక కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తే రూ.30 చొప్పున 1,67,886 కుటుంబాలకు రూ.50,21,460 అందచేయాల్సి ఉంది. మొత్తంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు దాదాపుగా రూ.2,24,71,460 అందచేయాల్సి ఉంది. వీటిని సకాలంలో అందచేయాలని కోరుతున్నారు.

పక్క జిల్లాల్లో అందజేశారు..



సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సకాలంలో గౌరవవేతనం అందజేయాలి. సీసీఎల్ మంజూరుకు ఉత్తర్వులు ఇవ్వాలి. అప్పుడే ఉద్యోగులుగా ఉపాధ్యాయులకు గౌరవం దక్కినట్లు అవుతుంది. పక్క జిల్లా అయిన వనపర్తిలో గౌరవ వేతనం అందజేశారని తెలుస్తోంది.

- పచ్చర్ల తిమ్మారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

సకాలంలో అందేలా చూస్తాం



సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహించిన ఎన్యుమరేటర్లకు సకాలంలో గౌరవవేతనం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు విడుదల కాగానే వారి వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం.

- నర్సింగరావు, అదనపు కలెక్టర్

కష్టపడ్డాం.. అభివృద్ధి చేశాం..

- నేటితో ముగియనున్న పుర పాలకుల పదవీ కాలం - 'ఆంధ్రజ్యోతి'తో ఉమ్మడి పాలమూరు జిల్లా మునిసిపల్ చైర్మన్ల మనోభావాలు

"ప్రజాసేవలో సంతృప్తిగా పనిచేశాం.. పదవీ బాధ్యతలు తీసుకున్న మొదట్లోనే కరోనా కష్టకాలాన్ని నిర్భయంగా ఎదుర్కొని కష్టపడ్డాం.. ఆ మహమ్మారి బారినుంచి ప్రజలను సురక్షితంగా కాపాడగలిగాం. అవగాహన కల్పిస్తూ వారిలో ధైర్యం నింపాం.. అలాగే, ఈ ఐదేళ్ల పదవీ కాలంలో అందరి సహకారంతో అభివృద్ధికి పాటుపడ్డాం. ప్రజల మెప్పు పొందాం.." అంటూ ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో గల మునిసిపల్ చైర్మన్లు తమ మనోభావాలను శనివారం 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. తాము ఎన్నో సవాళ్లను ఎదురొడ్డి ముందుకు సాగామన్నారు. కొందరు ప్రతిపక్షంలో ఉండి కూడా నిధులు రాబట్టుకొని అభివృద్ధికి బాటలు వేశామని తెలియజేశారు. ప్రజల ఆదరాభిమానాలు.. అధికారులు, తోటి కౌన్సిలర్ల సహకారాలతో మంచి పాలనను అందించామని సంతృప్తి వ్యక్తపరిచారు. అయితే, ఈనెల 26తో పదవీ కాలం ముగియనుండటంతో కొన్ని పెండింగ్ పనులు చేయలేకపోయామన్న బాధ ఉన్నదంటూ కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా వారు తెలిపిన పలు విషయాలను వారి మాటల ద్వారా తెలుసుకుందాం.

ఆల సహకారంతో అభివృద్ధి చేశా



భూత్పూర్: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహాయ, సహకారంతోనే భూత్పూర్ మునిసిపాలిటీని జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా అభివృద్ధి చేశా. ముఖ్యంగా మునిసిపాలిటీ పరిధిలో ఉన్న తండాలకు రూ.13.52కోట్లతో బీటీ రోడ్లు మంజూరు చేయించా. 10 వార్డుల్లో కోటి రూపాయల వ్యయంతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, రక్షిత మంచినీటి ట్యాంకులు, రంగస్వామి దేవాలయం దగ్గర కల్యాణ మంటపం నిర్మాణం చేయించాను. రూ. 25 కోట్లతో భూత్పూర్ నుంచి అమిస్తాపూర్ వరకు పాలమూరు రోడ్డు వెంట వీధి దీపాలు, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా పచ్చదనం, పారిశుధ్యం చేపట్టాను.

- బస్వరాజుగౌడ్, మునిసిపల్ చైర్మన్, భూత్పూర్

కరోనాలో ప్రజలకు సహాయ సహకారాలు అందించా



కొత్తకోట : మునిసిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తక్కువ రోజుల్లోనే కరోనా కాలంలో అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు సహాయ సహకారాలు అందించా. అవగాహన కల్పించడం జీవితంలో చాలా సంతృప్తి ఇచ్చింది. గతంలో మేజర్ పంచాయతీగా ఉండి ఎన్నికైన సర్పంచ్ ప్రజలకు సేవ చేస్తే మునిసిపాలిటీ అయ్యాక మొట్ట మొదటిసారి చైర్‌పర్సన్‌గా ప్రజలకు సేవ చేసే భాగ్యం అదృష్టంగా భావిస్తున్నా. మా కుటుంబ రాజకీయంగా ఉండటంతో మొదటగా కొన్ని నిర్ణయాలు తీసుకోలేక పోయా. మునిసిపాలిటీ భవనం, 30 పడకల హాస్పిటల్, కాంప్లెక్స్‌పై షాపుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయలేదనే బాధ ఉంది.

-పొగాకు సుకేశిని, చైర్‌పర్సన్, కొత్తకోట

పేట ప్రగతికి పాటుపడ్డాం



నారాయణపేట: తమ పాలనలో నారాయణపేట అభివృద్ధికి పాటు పడ్డాను. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పి కాసేపు సేద తీర్చుకునేందుకు పట్టణంలో అన్ని హంగులతో పార్కులు ఏర్పాటు చేయించా. పదేళ్ల పాటు మునిసిపాలిటీలో చైర్‌పర్సన్‌గా కొనసాగి ప్రజల సేవతో పాటు అందరి సహకారంతో పేట ప్రగతి చేసే అవకాశం లభించడం తనకు సంతృప్తిని ఇచ్చింది. పేట ప్రగతి కోసం ప్రజల ఎజెండాయే లక్ష్యంగా అధికార పార్టీలోకి మారాల్సి వచ్చింది. అమృత్ 2.0 పథకం కింద రూ.27 కోట్లతో తాగునీటి ఎద్దడి పూర్తి స్థాయిలో తీరి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కమిషనర్, ఇంజనీర్, సిబ్బంది, కౌన్సిలర్ల సహకారం లభించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

- గందె అనసూయ, చైర్‌పర్సన్, నారాయణపేట

ప్రజల ఆశీర్వాదం మరువలేనిది



వడ్డేపల్లి: మొదటిసారిగా వడ్డేపల్లి మునిసిపాలిటీ ఏర్పడిన అనంతరం చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవడం ప్రజల ఆశీర్వాదం మరువలేనిది. పదవీ కాలం ముగియడంతో మునిసిపాలిటీ పరిధిలో చేసిన అభివృద్ధితో పాటు ప్రజల సహకారాన్ని తాను ఎప్పటికీ గుర్తించుకుంటాను. మొదటిసారిగా గ్రామ పంచాయతీ ఏర్పడినప్పుడు మామ పెద్ద వెంకటరాముడు సర్పంచ్‌గా, తాను మొదటిసారి చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం మరువలేనిది. ఐదు సంవత్సరాల పదవీ కాలం ఇంత త్వరగా అయిపోయిందా అన్నట్లు అనిపిస్తుంది. సమీకృత మార్కెట్, డివైడర్, మునిసిపల్ కార్యాలయం కట్టి ఉంటే సంతోషంగా ఉండేది. శాంతినగర్‌లో రోడ్లు, డ్రైనేజీతో పాటు కొన్ని పనులు పూర్తి చేసినందుకు సంతృప్తిగా ఉంది.

● కరుణసూరి, చైర్‌పర్సన్, వడ్డేపల్లి

ప్రజల వల్లే ఈ స్థాయికి ఎదిగా..

అయిజటౌన్: అప్పట్లో నేను బీఆర్ఎస్ నుంచి మా వార్డులో కౌన్సిలర్‌గా పోటీ చేశా. ఎన్నికల తరువాత జరిగిన పరిణామాల్లో పార్టీ పెద్దలు నన్ను చైర్మన్‌గా ఎంపిక చేశారు. రైతుగా ఉన్న నేను చైర్మన్ కావటంతో అనేక అభివృద్ధి పనులు చేశాను. అయిదేళ్లలో దాదాపు రూ.60.66 కోట్ల నిధులు వెచ్చించి వార్డుల్లో పనులు చేయించా. పట్టణ ప్రజల చిరకాల స్వప్నం సెంట్రల్ లైటింగ్, రోడ్డు వైడనింగ్, డివైడర్ పనులు చేయటం చాలా తృప్తినిచ్చింది. ప్రజల వల్లే నేను చైర్మన్ స్థాయికి ఎదిగిన విషయం ఎప్పటికీ మరిచిపోను.

- చిన్న దేవన్న, చైర్మన్, అయిజ



సంతృప్తి ఉన్నా నిరాశ తప్పలేదు

గద్వాల టౌన్ : ఐదేళ్ల పదవీ కాలంలో అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా అభివృద్ధి పనులను నిబద్ధతతో చేశానన్న సంతృప్తి ఉంది. అదే సమయంలో ప్రభుత్వ పరంగా నిధుల మంజూరు సకాలంలో లభించకపోవడం వల్ల అనుకున్న స్థాయిలో పనులు పూర్తి చేయలేకపోయామన్న అసంతృప్తి ఉంది. విస్తరణ కాలనీలు గత ఐదేళ్లలో పెద్ద ఎత్తున పెరిగినా వాటిలో పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించడంలో వెనుకబడి ఉండటం అసంతృప్తిగా మిగిలింది. స్థానిక ఆదాయ వనరులను పెంచుకునే ప్రయత్నం జరిగినా కరోనా అనంతరం మార్కెట్‌లో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొంత వరకు ఉదాసీనంగానే వ్యవహరించాల్సి వచ్చింది. సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు.



● బీఎస్ కేశవ్, చైర్మన్, గద్వాల

అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశాం

ఆత్మకూరు: మునిసిపాలిటీ అభివృద్ధికి వైస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి మునిసిపల్ కౌన్సిల్‌తో కలుపుకుని అహర్నిశలు కృషి చేశాం. ముఖ్యంగా ఆత్మకూరు పట్టణ ప్రజల చిరకాల వాంఛ రోడ్ల విస్తరణ. గతంలో రోడ్ల విస్తరణ చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రయాణీకులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఈ క్రమంలో నూతనంగా ఎంపికైన మునిసిపాలిటీలో 2020లో అధికారం చేపట్టిన తక్షణమే రోడ్ల విస్తరణ చేపడుతామని హామీ ఇచ్చి అమలు చేశాం. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మంజూరు చేసిన రెండు కోట్ల నిధులతో ఆత్మకూరు పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఐదు సంవత్సరాల కాలంలో పట్టణ ప్రజలకు విద్యుత్, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించడంలో నిలిచాం.



- గాయత్రి, చైర్ పర్సన్, ఆత్మకూరు

పుట్టిన ఊరు.. అభివృద్ధి కోసం శ్రమించా..

కొల్లాపూర్: నేను పుట్టిన ఊరును అభివృద్ధి చేసే అవకాశం రావడం జీవితంలో మరిచిపోలేని సంతృప్తినిచ్చింది. నాలుగు సంవత్సరాల రెండు నెలల పాటు ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్‌గా ఉన్న కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న 6వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నాటి పాలకులను నిలదీసి మరి వార్డు అభివృద్ధి కోసం కృషి చేశా. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కొల్లాపూర్ నియోజకవర్గంలో జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టాక గత ఏడాది మే 31వ తేదీన తోటి కౌన్సిలర్ల సహకారంతో పెట్టిన అవిశ్వాస తీర్మానంలో మంత్రి ఆశీస్సులతో జూన్ 2న కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించాను. ఎనిమిది నెలల వ్యవధిలోనే దాదాపు 11 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టా.



- మేకల రమ్య, చైర్‌పర్సన్, కొల్లాపూర్


అనుకున్న పనులన్నీ చేయలేకపోయా

నాగర్‌కర్నూల్ టౌన్: నాగర్‌కర్నూల్ మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ జనరల్ స్థానం అయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తనపై నమ్మకంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాకు కేటాయించారు. మాజీ ఎమ్మెల్యే, కౌన్సిలర్ల సహకారంతో దాదాపు రూ.500 కోట్లకు పైగా నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నూతన కలెక్టరేట్, మార్కెట్‌యార్డు, మినీ ట్యాంక్ బండ్, మునిసిపల్ కార్యాలయం నూతన భవనం, సీసీ రోడ్లు, డివైడర్లు తదితర అభివృద్ధి పనులు చేశాను. తన ఐదేళ్ల పదవీ కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లు సంతృప్తికరంగా పని చేశాను. పదవీకాలంలో తనకు సహరించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు, 17వ వార్డు, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.



- కల్పన, చైర్ పర్సన్, నాగర్‌కర్నూల్

అదృష్టంగా భావిస్తున్నా



కల్వకుర్తి: ప్రజలకు మునిసిపల్ చైర్మన్‌గా నిస్వార్థ సేవలందించడం తన అదృష్టంగా భావిస్తున్నా. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి ఆశయాలకనుగుణంగా అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ రాములు, మాజీ ఎమ్మెల్యేలు గుర్క జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్‌ల సహకారంతో కల్వకుర్తి పట్టణంలో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. తాను చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత సంవత్సరంన్నర కరోనా కాలంలో ప్రజలను కరోనా బారిన పడకుండా కౌన్సిల్ సభ్యుల సహకారంతో కాపాడగలిగాం. పట్టణంలో డంపింగ్ యార్డు కోసం స్థలం కొనుగోలు చేయడంతో పాటు మిషన్ భగీరథలో ఇంటింటికి నీరందించాం.

- ఎడ్మ సత్యం, చైర్మన్, కల్వకుర్తి

ప్రజలకు రుణపడి ఉంటా



పెబ్బేరు రూరల్: నేనే ప్రజల మనిషిని.. వారి సేవకురాలిని. ప్రజలు ఇచ్చిన తీర్పుతో, నా తోటి కౌన్సిలర్ల సహకారంతో పెబ్బేరు మునిసిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనాను. పదివి ఉన్నా లేకున్నా ప్రజల కష్టనష్టాల్లో వారి వెన్నంటే ఉండి అన్ని వర్గాల ప్రజలకు సేవ చేశా. పదవి చేపట్టిన నుంచి పెబ్బేరు పట్టణ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేశాను. ప్రజల సమస్యలు నా దృష్టికి వచ్చి వాటిని పరిష్కరించా. కరోనా కష్టకాలంలో ప్రజలకు నేను అండగా నిలబడ్డా. ఒక మహిళగా ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ, ప్రజలకు జవాబుదారీగా బాధ్యతలు నిర్వర్తించడం సంతృప్తిగా ఉంది. నా భర్త సాయినాథ్ నా వెంట ఉండి ప్రతీ పని అతని సహకారంతో అభివృద్ధి చేశా.

- కరుణశ్రీ, చైర్‌పర్సన్, పెబ్బేరు

ప్రజలకు సేవ చేయడం అదృష్టం



మక్తల్: సమాజంలో ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. మక్తల్ మునిసిపాలిటీగా ఏర్పడటం, మొదటిసారి చైర్మన్ కావడం తన అదృష్టంగా భావిస్తున్నా. మునిసిపాలిటీని మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళా బిల్లుకు చేయూతనివ్వాల్సిన అవసరం ఉంది.

రాబోయే తరంలో మహిళలను రాజకీయంలో రాణించేలా ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. అన్ని పార్టీలతో కలుపుకొని అభివృద్ధికి కృషి చేశా. నా పదవీ కాలం ముగిసినా ప్రజలతోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

- బాల్చెడ్ పావనీ, చైర్‌పర్సన్, మక్తల్

ప్రతిపక్షంలో ఉండి అహర్నిశలు కష్టపడ్డా



అలంపూరు: అలంపూరు నియోజక వర్గంలో మొట్టమొదటి మునిసిపాలిటీ అలంపూరు అభివృద్ధి కోసం ఐదు సంవత్సరాల కాలంలో ఒకటిన్నర సంవత్సర కాలం పాటు ప్రతిపక్షంలో ఉంటూనే అహర్నిశలు శ్రమించా. అలంపూరుకు రెండుసార్లు రాష్ట్రపతి అవార్డులు తీసుకున్నాం. అభివృద్ధి కోసం 1600 మందితో పాదయాత్ర కూడా చేశాం. ఇంకా రెండు సంవత్సరాలు కరోనా వచ్చి ఇబ్బంది పడ్డాం. గత ప్రభుత్వం నుంచి నిధులు రావడంతో పనులు ప్రారంభించాం. మేము ప్రారంభించిన పనులకు కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాక పనులు అలాగే నిలిచాయి. ఇప్పటి ప్రభుత్వం నుంచి ఇంత వరకు చిల్లీ గవ్వ కూడా నిధులు వచ్చింది ఏమీ లేదు. అయినా పట్టణంలో తాగునీరు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శానిటేషన్, విద్యుత్ సమస్య రాకుండా చూశాం.

- మనోరమ, చైర్‌పర్సన్, అలంపూరు

అందరి సహకారంతో అభివృద్ధి చేశాం

అమరచింత: ప్రజలందరి సహకారంతో ఐదేళ్లలో మునిసిపాలిటీ అభివృద్ధి పనులు చేయగలిగాం. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆయా కాలనీలలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలు ప్రధాన రహదారిపై డివైడర్, సెంటర్ లైటింగ్, హరితహారం ద్వారా మొక్కలు, ఆయా కాలనీలలో పార్కులు, ఆట స్థలాలు, అన్ని వార్డుల్లో వీధి దీపాలు, ప్రతీ రోజు ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేశాం. ఐదేళ్ల తమ మునిసిపాలిటీ పాలన వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుల సహకారంతో సంతృప్తి ఇచ్చింది.

-మంగమ్మ, చైర్ పర్సన్, అమరచింత



చైర్‌పర్సన్‌గా కొనసాగడం మంచి అనుభూతినిచ్చింది

కోస్గి రూరల్: కోస్గి మునిసిపల్ చైర్ పర్సన్‌గా నిత్యం ప్రజా సేవ చే యడం మరచిపోలేని అనుభూతినిచ్చింది. ప్రజల మధ్య ఎలా కాలం గడి చిందో తెలియకుండానే కాలం పూర్తి అయింది. ప్రజలు మరోసారి అవకాశం కల్పిస్తే ప్రజా సేవలో ముందుంటాను. ప్రజా సేవ లో ఐదేళ్ల కాలం తెలియకుండానే గడిచిపోయింది. నాకు సహకరించిన కోస్గి ప్రజలకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

- అన్నపూర్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్, కోస్గి



క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీ మోహన్‌బాబు

- ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీలు



:ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల జీ మోహన్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఉమ్మడి పాలిటెక్నిక్ కళాశాల ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతిభ గల క్రీడా కారులకు కొదవలేదని, ఎంతో మంది జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించారు. వనపర్తి, పెబ్బేర్, గద్వాల, వడ్డేపల్లి, కోస్గి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ, జేపీఎన్‌సీ కళాశాలల జట్ల క్రీడాకారులు హాజరయ్యారు.

జిల్లా కోశాధి కారి(డీటీవో) శ్రీనివాస్, కళాశాల జీ. మోహన్ బాబు, అధ్యాపకులు అప్పారావు, వీరస్వామి, రాజేశ్వరి, ప్రవీణ, పీడీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఫలితాలు...

బాలుర విభాగంలో 400 మీటర్ల రిలే పరుగులో మహబూబ్‌నగర్ కళాశాల ప్రథమ, వడ్డెపల్లి కళాశాల ద్వితీయ, బాలికల విభాగంలో రిలే పరుగులలో పెబ్బేర్ కళాశాల ప్రథమ, మహబూబ్‌నగర్ కళాశాల ద్వితీయ స్థానాలను దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగులో ఎం. వినీత్ ప్రథమ, శివశంకర్ ద్వితీయ(మహబూబ్‌నగర్),200 మీటర్ల పరుగులో ఎం. వినీత్ ప్రథమ(మహబూబ్‌నగర్, తేజ ద్వితీయ (కోస్గి), 400 మీటర్లలో రజినికాంత్ ప్రథమ. వై మురళి ద్వితీయ (మహబూబ్‌నగర్), 800 మీటర్లలో విఘ్నేశ్వర్ ప్రథమ, శివకుమార్ ద్వితీయ, 1500 మీటర్లలో శివకుమార్ ప్రథమ (మహబూబ్‌నగర్), తేజ ద్వితీయ(కోస్గి) స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగులో మైత్రి ప్రథమ(పెబ్బేర్), స్నేహ ద్వితీయ(మహబూబ్‌నగర్), 200 మీటర్లలో భవాని-ప్రథమ (జేపీఎన్‌సీఈ), మైత్రి ద్వితీయ (పెబ్బేర్), 400 మీటర్లలో నందిని ప్రథమ (పెబ్బేర్), పల్లవి ద్వితీయ(మహబూబ్‌నగర్), 800 మీటర్లలో ప్రశాంతి, చందన ద్వితీయ (మహబూబ్‌నగర్), 100 మీటర్లలో నిఖిత ప్రథమ (మహబూబ్‌నగర్), అనూష ద్వితీయ(కోస్గి) స్థానాల్లో నిలిచారు.

విజేతగా నిలవాలి

- టీడీసీఏ కన్వీనర్ నవీన్‌కుమార్



ఉమ్మడి జిల్లా టీడీసీఏ జట్టు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని తెలంగాణ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నవీన్ కుమార్ అన్నారు. హైదరాబాద్ దోమల్‌గూడలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు టీడీసీఏ అంతర్‌జిల్లాల అండర్-17 టీ-20 టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలను శనివారం క్రిస్టియన్‌పల్లి బ్రదర్ ఉడ్ క్రికెట్ అకాడమీలో నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు టోర్నీలో ప్రతిభ కనబరిచడానికి మంచి అవకాశం ఉందని తెలిపారు. క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలన్నారు. కోచ్, మేనేజర్లు సయ్యద్‌నవాజ్‌షా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా టీడీసీఏ జట్టు...

రవితేజ, దుర్గ, అర్షద్, నిఖిల్, సాత్విక్, రాంచరణ్, సయీద్, అబ్దుల్‌వాసే, సంజయ్, బీరేందర్‌కుమార్, దక్షపాటిల్.

నేడు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

నిజామాబాద్ జిలా మామిడి పల్లిలో ఫిబ్రవరి 1 నుంచి 3 తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సీనియర్స్ మహిళ టోర్నీ పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా మహిళ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ కోచ్ రాఘవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు రిపోర్టు చేయాలని కోరారు.

భర్త ఆచూకీ కోసం పోలీసులకు భార్య ఫిర్యాదు



వడ్ల లక్ష్మయ్య (ఫైల్)

ఊట్కూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఊట్కూర్ మండలంలోని అవుసులోన్‌పల్లి గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మయ్య (32) శుక్రవారం నుంచి కనిపించడం లేదని భార్య తిమ్మమ్మ శనివారం ఊట్కూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం ప్రకారం.. వడ్ల తిమ్మమ్మ వివాహం గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మయ్యతో 18 సంవత్సరాల క్రితం జరిగింది. ప్రస్తుతం వారికి ముగ్గురు సంతా నం ఉన్నారు. శుక్రవారం నాడు వడ్ల లక్ష్మయ్య బట్టలు ఐరాన్ చేసుకొస్తా నని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపో వడంతో చుట్టుపక్కల వారిని అడగటంతో పాటు గ్రామంలో వెతికినా కనిపించలేదు. దీంతో బంధువుల దగ్గర కూడా ఫోన్ చేసి తెలుసుకున్నా రాలేదని సమాధానం రావడంతో తన భర్త తప్పిపోయాడని తిమ్మమ్మ శనివారం సాయంత్రం ఊట్కూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్నా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని అన్నారు.

హత్య కేసులో ఒకరి రిమాండ్

ఉప్పునుంతల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపిన కేసులో కొ డుకును రిమాండ్ చేసినట్లు ఎస్సై వెంకటరెడ్డి తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని పూర్యానాయక్‌తండాలో గురువారం దా మ్లాను కన్న కొడుకు మైనర్‌తో పాటు మృతుడి అన్న కుమారుడు రామాంజనేయులు ఇద్దరు కలిసి హత్య చేశారు.

ఈ సంఘటనలో శనివారం అచ్చంపేట కోర్టులో వారిని హాజరు పరిచగా మైనర్‌ను జువైనల్‌హోమ్‌కు తరలించగా మేజర్ రామాంజనేయులును రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హైకోర్టు జడ్జికి కలెక్టర్ స్వాగతం



హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

వనపర్తి క్రైమ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయమూర్తులతో అధికారిక సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్ కుమార్ జూకంటికి కలెక్టర్ ఆదర్శ్ సురభి స్వాగతం పలికారు. శనివారం జిల్లా న్యాయాధికారులతో అధికారిక సమావేశంలో పాల్గొనేందుకు రావడంతో కలెక్టర్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, సంచిత్ గంగ్వార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ ప్రాంగణంలో స్వాగతం పలికారు. అనంతరంలో సమావేశంలో పాల్గొన్నారు. అలాగే, శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

- మాతా మాణికేశ్వరి ట్రస్ట్ కార్యదర్శి శివయ్యస్వామి

నారాయణపేట న్యూటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందని యానగుంది మాతా మాణికేశ్వరి ఆశ్రమ కార్యదర్శి శివయ్యస్వామి అన్నారు. శనివారం రాత్రి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్థానిక గోడుగేరి అభయంజనేయస్వామి దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఈ సందర్భంగా మాణిక్యగిరి క్షేత్రం యానగుంది మాతా మాణికేశ్వరి ఆశ్రమ కార్యదర్శి శివయ్యస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ హిందూ సంస్కృతీ సంప్రదాయలను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అహింసామార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలన్నారు. మాణికేశ్వరి మాతా మార్గదర్శనంలో నడుస్తూ భారతదేశంలో భగవంతుడు పుట్టిన పుణ్యదేశం అన్నారు. తనలోనే ఉన్న దేవుడిని తెలుసుకోవడానికి నిత్యం జపం చేయాలని దేవుడు సర్వంతర్యామి అన్నారు. దేవుళ్లను ఆరాదించాలన్నారు. హిందూ ఐక్యవేదిక కన్వీనర్, ఉత్సవక మిటీ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, ఆర్ఎస్ఎస్ నగర సంచాలక్ డాక్టర్ మదన్‌మోహ న్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ప్రవీణ్, శివకుమార్, శ్రవణ్, బండి శివరాంరెడ్డి, మిర్చి వెంకటయ్య, గుంపు బాల్‌రాజ్, హిందూ ఐక్య వేదిక సభ్యులు తదితరులున్నారు.





పేట గోడుగేరి ఆంజనేయస్వామి దేవాలయంలో మాట్లాడుతున్న శివయ్యస్వామి, హాజరైన భక్తులు

ఇంటర్వ్యూ..

భూ సమస్యల పరిష్కారానికి కృషి

- ఉప్పునుంతల తహసీల్దార్ ప్రమీల



ఉప్పునుంతల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మా పరిధిలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఉప్పునుంతల తహసీల్దార్ ప్రమీల అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

మండలంలో మొత్తం వ్యవసాయ భూమి ఎంత ?

మండలంలో మొత్తం 17,461 మంది రైతులు ఉన్నారు. భూమి విస్తీర్ణం 46,268 ఎకరాలు ఉంది. అందులో అంతా సాగుకు అనుకూలమైన భూమి.

రైతు భరోసా కోసం సర్వే నిర్వహించారా? నిరుపయోగమైన భూమిని గుర్తించారా?

ఇటీవలే రైతు భరోసా సర్వే పూర్తి అయ్యింది. సాగుకు యోగ్యం కాని భూములు, పౌల్ట్రీ ఫారం, ఇంటిస్థలాలు కలిపి మొత్తం 132 ఎకరాల భూమిని గుర్తించాం.

మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

మండలంలో ప్రస్తుతం ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వడంలేదు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ప్రభుత్వ నిర్మాణాలకు మాత్రం ఇసుక రవాణా చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

ఆర్థిక సహాయం

చారకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారం గ్రామానికి చెందిన ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి బాస్కర్‌రావు శనివారం గోకారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితకుటుంబానికి వారు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్, అల్లాజీ, రవి, శ్రీను, రషీద్, సాయి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

చారకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని జూపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న 17 మంది విద్యార్థులకు జూపల్లి గాంధీజీ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీజీ యువజన సంఘం అధ్యక్షుడు పరంజ్యోతి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే క్రీడా సామగ్రి తదితర వాటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ఝాన్సీరాణి, మాజీ సర్పంచ్ బాలేమియ, డీసీసీ ప్రధాన కార్యదర్శి పాలాది బాలరాజు, నాయకులు భిక్షపతియాదవ్, రాములు యాదవ్ పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్‌ఫెయిర్‌లో బల్మూరు విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న గగన్‌చంద్ర

అచ్చంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాండిచ్చేరిలో ఈనెల 20వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించిన దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ విద్యా బాల వైజ్ఞానిక ప్రదర్శనలో బల్మూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గగన్‌చంద్ర ప్రతిభ కనబర్చాడు. అతను ప్రదర్శించిన ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ అంశంలో హైబ్రిడ్ త్రీ ఇన్‌వన్ సైకిల్ రాష్ట్రం నుంచి తృతీయ బహుమతికి ఎన్నిక కావడంపై పాఠశాల హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, గైడ్ టీచర్ సీతారాం, ఉపాధ్యాయులను ఎంఈవో విష్ణుమూర్తి అభినందించారు. పాఠశాలలో జరిగిన పేరెంట్స్, ఉపాధ్యాయ సమావేశంలో అభినందించారు.

'లక్షల డప్పులు, వేల గొంతుకల ప్రదర్శనను జయప్రదం చేయాలి'

మన్ననూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ నేతృత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకలతో కూడిన మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీం మాదిగ అన్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ మండల కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కొయ్యల వెంకటేష్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా బాలయ్య, వెంకటేష్, కార్యదర్శులుగా జగన్, హుసేన్, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ నెల 30న జిల్లా కేంద్రాల్లో జరిగే డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నచెర్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోళ్ల సుదర్శన్, వంగూరి శంకర్, ఉపాధ్యక్షులుగా కూర రవికుమార్, వంగూరి రామకృష్ణ, దేవరపాగ నాగరాజు, సహాయ కార్యదర్శిగా దేవరపాగ జనార్దన్, కోశాధికారిగా కుంటిపిల్ల రాముడుతోపాటు కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు కలిగి ఉండాలి

- అచ్చంపేట ఆర్డీవో మాధవి



రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో అచ్చంపేటలో ర్యాలీ

అచ్చంపేటటౌన్/ ఉప్పునుంతల/ పెద్దకొత్తపల్లి/ బిజినేపల్లి/ తాడూరు/ కల్వకుర్తి/ చారకొండ/ వెల్దండ/ తిమ్మాజిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : యువత ఓటు హక్కును కలిగి ఉండడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని అచ్చంపేట ఆర్డీవో మాధవి అన్నారు. ఓటుహక్కు సామాన్యుడి చేతిలో ఉన్న వజ్రాయుధమని అన్నారు. జాతీయ ఓటర్స్ దినోత్సవం సందర్భంగా శనివారం అచ్చంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ● ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీల సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ● పెద్దకొత్తపల్లిలో తహసీల్దార్ జేకే.మోహన్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులతో రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ● బిజినేపల్లిలో తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ప్రజలతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. ● తాడూరులో తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో ఆంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును పొందాలని సూచించారు. ● కల్వకుర్తి పట్టణంలో ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ చౌరస్తాలో ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బీఎల్‌వోలను, సీనియర్ సిటిజన్ ఓటర్లను ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీంలు సత్కరించారు. ● చారకొండలో తహసీల్దార్ తహసీల్దార్ అద్దం కి సునీత ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఓటర్లను శాలువాలతో సన్మానించారు. ● వెల్దండలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎస్ఐ కురుమూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఓటరు దినోత్సవ ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. ● తిమ్మాజిపేటలో తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంపీడీవో లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో అధికారులు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తిమ్మాజిపేటలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.



వెల్దండ : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



కల్వకుర్తి : అంగన్‌వాడీ టీచర్ అలివేలను సన్మానిస్తున్న ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, నాయకులు

వట్టెం వెంకన్న ఆలయంలో లక్షతులసి అర్చన



వట్టెం వెంకన్న ఆలయంలో ఉత్సవ మూర్తులకు లక్ష తులసి అర్చన చేసి ఊరిగిస్తున్న భక్తులు

బిజినేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వట్టెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సర షట్తిల ఏకాదశి పురస్కరించుకొని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి మంగళాశాసనాలతో శనివారం లక్ష తులసి అర్చన ఘనంగా నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సండడి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. లక్ష తులసి అర్చన మహోత్సవాన్ని జడ్చర్ల వాస్తవ్యులు ముటుపూర్ నాగేశ్వర్, మణెమ్మ దంపతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల నివారణ, రాజ్య క్షేమంగా ఉండాలనే సంకల్పంతో లక్ష తులసి అర్చన చేపట్టినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భకులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదస్వామి, వాస ఈశ్వరయ్య, భాస్కరాచారి, కొర్ర చంద్రారెడ్డి, గుబ్బ సత్యనారాయణ, దెంది కృష్ణారెడ్డి, భరత్ చెన్నాకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కందనూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు (నాగనూల్)లో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి శనివారం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాల్వల పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు సుల్తాన్, జక్క రాజు, కావలి శ్రీను, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నిరంజన్, శాంతయ్య, సంతోష్‌గౌడ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

తాడూరు : మండలంలోని చెర్లతిర్మలాపూర్ గ్రామంలో శంకర్, శాంతమ్మ దంపతుల కుమారుడు నాని శుక్రవారం రాత్రి ఫిట్స్‌తో పొలంలోనే పడిపోయి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేయాలి

- చివరి మునిసిపల్ సమావేశంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిల్ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పదవిలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నిజాయితీగా పని చేస్తే ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మునిసిపల్ సమావేశ మందిరంలో పురపాలక సంఘం చివరి సాధారణ సమావేశం చైర్మన్ ఎడ్మ సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కల్వకుర్తి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం నుంచి తగిన నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా సూదిని జైపాల్‌రెడ్డి, ఎడ్మ కిష్టారెడ్డి, చిత్తరంజన్‌దాస్‌లు నిజాయితీగా పని చేసి తగిన గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిల్ సభ్యులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ షాహెద్, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, మాజీ మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

● వెల్దండ : పెద్దాపూర్ గ్రామపంచాయతీలోని తుంకిబండతండాకు చెందిన వడ్త్యావత్ కిషన్‌నాయక్ అనారోగ్యం పాలవగా, చికిత్స నిమిత్తం మంజూరైన రూ.46వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి బాధితుని కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ, వడ్డెరసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వరికుప్పల ఆంజనేయులు, అంబేడ్కర్ యువజనసంఘం అధ్యక్షుడు కేశమళ్ల చంద్రశేఖర్, నాయకులు అనిల్, మహేష్, నందు, రఘు ఉన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ.20.70కోట్లు

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మాధవానిపల్లిలో పల్లెదవాఖాన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్/ మన్ననూర్/ చారకొండ,జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట నియోజకవర్గంలోని బీటీ రహదారుల మరమ్మతులకు రూ. 20.70 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మన్ననూరు అటవీ శాఖ అతిథి గృహంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరిశ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తుల్యా నాయక్, రవికుమార్, యశ్వంత్, రమణగౌడ్, అంజి, రాజారాంనాయక్, రాజు, శివప్రసాద్ పాల్గొన్నారు. ● ఉదయం మన్ననూరులో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మన్ననూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ. 10 లక్షలు, హనుమాన్ ఆలయ గోపురం నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సీసీ రహదారి పనులకు, అంగన్‌వాడీ కేంద్ర భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలకమండలి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంభు శోభ, నంది హన్మంత్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో కమల, పంచాయతీ కార్యదర్శి భీముడు, మాజీ ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, నాయకులు తుల్యానాయక్, సంభు వెంకట్‌రమణ, రాజారాం, వెంకటేశ్వర్లు, గెలువయ్య పాల్గొన్నారు. ● అమ్రాబాద్ మండల పరిధిలోని మాధవానిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రం, పల్లెదవాఖాన భవనాలకు ఎమ్మెల్యే వంశీ కృష్ణ భూమి పూజ చేశారు. వైద్యాధికారులు, నాయకులు ఉన్నారు.

● చారకొండ నుంచి రాంపురం వరకు, బీటీ రోడ్ పనులకు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. షైబు సుభాని ఉర్సు గంధోత్సవంలో పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్లగురువయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్తఫా, చారకొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, గణేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ భీముడు నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్థోమత లేని ఖైదీలకు న్యాయవాదిని నియమిస్తాం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్ బాబు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు

కందనూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్థోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీల హక్కుల గురించి జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో నిర్వహించిన సమావేశానికి ప్రధాన న్యాయాధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులను వివరించారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదిస్తే ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు వారానికోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.శ్రీనివాసులు, ఎం.మధుసూదన్‌రావు, ఏసీపీ శ్రీరామ్ ఆర్య, పవన శేషసాయి, జైల్ సూపరింటెండెంట్ బి.నాగరాజు, జైలు సిబ్బంది, న్యాయశాఖ ఉద్యోగులు ఎం.కేశవరెడ్డి, ఎం.బాలరాజు, ఎం.రాజు, వంశీ, నాగరాజు, స్వప్న పాల్గొన్నారు.

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పై ర్యాలీ

అమ్రాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం, ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన అమ్రాబాద్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ రజిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు యూనిఫాంల పంపిణీ

కోడేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్మికులకు శనివారం ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్మికులకు రూ.10లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కార్డులను కూడా కల్పించిందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ, కార్మికులు రాములు, చెన్నయ్య, కురుమయ్య, వసంత, భాస్కర్, బాలచంద్రమ్మ పాల్గొన్నారు.

పలు తండాల్లో ఎక్సైజ్ దాడులు

- 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వెల్దండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సారా నిర్మూలన స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా శనివారం మండల పరిధిలోని కొత్రతండా, కలిమిరాళ్లతండా, క్రషర్ మిల్లు తండాలలో కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ, మహబూబ్‌నగర్ టాస్క్‌ఫోర్స్ టీంల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆయా తండాలలో సారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ జే. వెంకట్‌రెడ్డి, డీటీఎఫ్ సీఐ కవితారెడ్డి, సిబ్బంది మహేష్, మాదవి, ఏలియా, ప్రశాంత్ ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

కందనూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ.స్వరాజ్యలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వరకు పక్షం రోజులు స్పర్శ లేని కుష్ఠు వ్యాధి అవగాహన ఉద్యమం (స్పాక్) నిర్వహించాలని వైద్యాధికారులకు, కుష్ఠు వ్యాధి నోడల్ పర్సన్స్‌కు సూచించారు. ఆమె మాట్లాడుతూ జనవరి 30వ తేదీన జరిపే మహాత్మా గాంధీ వర్ధంతిని కుష్ఠు వ్యాధి వ్యతిరేక దినంగా పాటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్, డాక్టర్ తారాసింగ్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రవికుమార్, వైద్యాధికారులు డీపీవో రేణయ్య, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు సుకుమార్‌రెడ్డి, వెంకటయ్య, మధుమోహన్, చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొన్నారు.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి ఘన సన్మానం



శివారెడ్డిని సన్మానిస్తున్న కవులు, రచయితలు

కొల్లాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం మాజీ ఉప కులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి రచించిన మనసు పూచిన పూలు పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ హాల్లో ఘనంగా జరిగింది. కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన కవులు, రచయితలు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలుగు భారతి సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి వేదార్థం మధుసూదనశర్మ మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలంలోని కాలూరు గ్రామానికి చెందిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గొప్ప చదువులు చదివి వివిధ హోదాలలో పని చేశారని కొనియాడారు. సన్మాన కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలియజేసిన వారిలో ప్రముఖ కవులు పెద్దూరి వెంకట దాసు, రఘువీర్ ప్రతాప్, మేనావత్ రాందాస్ తదితరులు ఉన్నారు.

విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంఎం గౌడ్

అచ్చంపేటటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్‌ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎంఎం గౌడ్ అన్నారు. బీఎల్‌ఎఫ్ 7వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలంతో కలిసి ఆయన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగం బలోపేతం కోసం తగిన నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాలలో జనరల్ ఆసుపత్రులు, మండల, గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్య ప్రైవేట్ వ్యాపారం అయినందున ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయిందని పేర్కొన్నారు. విద్యా భివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ నాయకులు బాలస్వామి, సుందరం, బుగ్గన, రేష్మ, సరోజ, సునిత, ప్రమీల పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

కల్వకుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం తెలంగాణ నాల్గవ రాష్ట్ర మహాసభలకు కల్వకుర్తి నుంచి సీపీఎం నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. సంగారెడ్డిలో జరుగుతున్న భారీ ర్యాలీ, బహిరంగ సభకు తరలి వెళ్తున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. పేద ప్రజల తరఫున అనేక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ధం పర్వతాలు, నాయకులు ఏపీ మల్లయ్య, బాలయ్య, మల్లారెడ్డి, శ్రీను, యాదయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

- ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ శ్యాంసుందర్



మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ శ్యాంసుందర్

కల్వకుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేద్దామని ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ శ్యాంసుందర్ కోరారు. కల్వకుర్తి పట్టణంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు కొండూరు గోవర్ధన్ అధ్యక్షతన ఆర్యవైశ్య కల్వకుర్తి పట్టణ, మండల మహిళా యువజన విభాగాల నూతన కమిటీల ప్రమాణ స్వీకారం జరిగింది. శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు, నాయకులు చంద్రకుమార్, మనోహర్, మల్లేష్, శివ, జగదీశ్వర్, శ్రీనివాసులు, శ్రీధర్, సురేష్, అంజనేయులు, లక్ష్మీనారాయణ, రాఘవేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలి

- ఎంపీడీవోకు బీజేపీ నాయకుల వినతి



పెద్దకొత్తపల్లి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి/ కోడేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో నాగేంద్రంకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అధికారులు అర్హులైన పేదలను గుర్తించి పారదర్శకతను పాటించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులను గుర్తించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో గ్రామసభల్లో పాల్గొన్న అధికారులను బాధ్యులు చేస్తూ ఉద్యమ కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు మేకల శివ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గువ్వలి వెంకటయ్య, మాజీ జిల్లా కార్యదర్శి కోట్ల సుధాకర్‌రావు, మేకల శివయాదవ్, రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● కోడేరు : జిల్లాలో 200 యూనిట్ల విద్యుత్ వినియోగం దాటని వారు బిల్లులు చెల్లించొద్దని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేడిమాకుల శేఖర్ అన్నారు. శనివారం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సొప్పరి రామకృష్ణ, బద్దుల రాజు, పొడేండ్ల చంద్రయ్యపాల్గొన్నారు.

● కొల్లాపూర్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలక తీతంగా అర్హులకు న్యాయం చేయాలని బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహ జ్యోతి పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేకుండా నిజమైన అర్హులకు దక్కేలా మునిసిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు కాడం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సందు రమేష్, బీజేపీఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కద్దాలా కృష్ణ, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాశీపురం మహేష్, నాయకులు మెంటె శివకృష్ణ యాదవ్, ఇరగదిండ్ల పరమేష్, బడా చందు యాదవ్, ఇరగదిండ్ల మద్దిలేటి, పల్లె మహేష్, నవీన్ యాదవ్, సత్యం తదితులు పాల్గొన్నారు.